### జాతీయ సాధన సర్వే పరీక్షను విజయవంతం చేయండి

నిర్మల్ అర్బన్, నవంబర్ 28: జాతీయ సాధన పరీక్షను విజయవంతం చేయాలని డీఈవో రామారావు అన్నారు. గురువారం నిర్మల్‌లోని పంచశీల్ కళాశాలలో నిర్వహించిన జాతీయ సాధన సర్వే పరిశీలన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో డిసెంబర్ 4న నిర్వహించే జాతీయ సాధన సర్వే పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని, నిర్వాహకులకు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సిద్ధ పద్మ పాల్గొన్నారు.

### పకడ్బందీగా కంప్యూటరైజేషన్ చేయాలి

నిర్మల్ అర్బన్, నవంబర్ 28:సామాజిక, ఆర్థిక సర్వే కంప్యూటరైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో రామారావు అన్నారు. గురువారం నిర్మల్‌లోని విన్నర్ పాఠశాలలో నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక సర్వే కంప్యూటరైజేషన్ ప్రక్రియను పరిశీలించారు.ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మీకాంత్, ప్రిన్సిపాల్ రాజు, లింబాద్రి ఉన్నారు

### ఆశ్రమ పాఠశాల సందర్శన

ఇచ్చోడ(సిరికొండ), నవంబర్ 28: సిరికొండ మండలం రాయిగూడ ఆశ్రమ పాఠశాలను గురువారం తహసీల్దార్ తుకారాం సందర్శించారు. రికార్డులు, వంట గది, మంచినీటిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు ఆత్రం భాస్కర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

### ఆదివాసీ గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ఇంద్రవెల్లి, నవంబర్ 28: అనంతపూర్ గ్రామంలో పోలీసులు ఆధ్వర్యంలో ఎస్ఐ సునీల్ 50 మంది ఆదివాసీ గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ సోముపటేల్, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు పుర్కా చిత్రు, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రామాలాభివృద్ధికి కృషి

బోథ్, నవంబర్ 28: మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి అన్నారు. గురువారం ఘన్‌పూర్ గ్రామంలో రూ.4లక్షలతో చేపడుతున్న గ్రావెల్ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పోతన్న, రమేశ్, అనిల్ పాల్గొన్నారు.

### సానాలలో పత్తి కొనుగోళ్లు నిలిపివేత

బోథ్, నవంబర్ 28: సానాలలోని గురు సాహెబ్ చండ జిన్నింగ్ ఫ్యాక్టరీలో శుక్రవారం నుంచి డిసెంబర్ 1 వరకు పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి విఠల్ ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి నిలువలు అధికంగా ఉన్నందున కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 2 నుంచి కొనుగోలు యథావిధిగా జరుగుతాయని రైతులు సహకరించాలని కోరారు.

### బోథ్‌లో 1.21లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు

బోథ్, నవంబర్ 28 : బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో గురువారం వరకు 1,21,056 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన 7,144 మంది రైతులకు చెందిన పత్తిని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. సీసీఐ ఆధ్వర్యంలో 6367 మంది రైతులకు చెందిన 1,10,279 క్వింటాలు, ప్రైవేట్ వ్యాపారులు 777 మంది రైతులకు చెందిన 10,777 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు నాణ్యమైన పత్తిని అమ్మకానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు.

### కేజీబీవీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

భైంసా, నవంబర్ 28 : కేజీబీవీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శంకర్ అన్నారు. గురువారం భైంసాలోని కేజీబీవీలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే కేజీబీవీలో ఆంగ్లం, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు లేక విద్యార్థులు నష్టపోతున్నారని, వెంటనే స్పందించి ఉపాధ్యాయులను భర్తీ చేయాలన్నారు. అంతేగాకుండా ఉపాధ్యాయులకు బేసిక్ పే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అశోక్, రమేశ్, ఎస్‌కే ఫాజిల్ పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

దస్తురాబాద్,నవంబర్28 : రాంపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఏఈవో తిరుపతి తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకరావాలని సూచించారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

### నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

దస్తురాబాద్, నవంబర్ 28 : విద్యార్థులకు నాణ్యతో కూడిన ఆహారాన్ని అందించాలని మండల విద్యాధికారి గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. వంట గదిని, గోదాంను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట ఎస్వో తిరుమల, ఉపాధ్యాయులు ఉన్నారు.

### జనసభను విజయవంతం చేయండి

పెంబి, నవంబర్ 28: వరంగల్‌లో డిసెంబర్ 6వ తేదీన నిర్వహించనున్న జనసభకు సంబంధించిన కరపత్రాలను గురువారం మండల కేంద్రంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతానాలు అందడం లేదన్నారు. ఈ జనసభకు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇంద్రవెల్లి, నవంబర్ 28: ముత్నూర్ గ్రామానికి చెందిర ముండే దత్తా ఇటీవల రోడ్డు ప్రమాదంలో, అదే గ్రామానికి చెందిన సత్యానారాయణ, వెంకటిలు అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను గురువారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు జిలానీబేగ్, భీంరావ్, దేవేందర్ ఉన్నారు.

### కడెం నాయబ్ తహసీల్దార్‌గా లచ్చిరాం

కడెం, నవంబర్ 28: కడెం నాయబ్ తహసీల్దార్‌గా లచ్చిరాం గురువారం బాధ్యతలు స్వీకరించారు. పెంబి మండల నాయబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆయన బదిలీల్లో భాగంగా కడెంకు వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ నాయబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జాదవ్ శంకర్ బదిలీపై పెంబి మండలానికి వెళ్లారు. నూతనంగా వచ్చిన లచ్చిరాంను గురువారం కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాతరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### బేల ఎస్ఐగా దివ్యభారతి

బేల, నవంబర్ 28 : మండల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా దివ్యభారతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ రాధిక తాంసి మండలానికి బదిలీ కావడంతో బేలకు దివ్యభారతి పూర్తి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మహిళలు, సైబర్ క్రైమ్, ఇవ్‌టీజింగ్‌పైన ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

# దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

నార్నూర్, నవంబర్ 28 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సహకార సంఘం చైర్మన్ సురేశ్, పార్టీ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావ్ పిలుపునిచ్చారు. గురువారం నార్నూర్‌లోని కుమ్రం భీం కాంప్లెక్స్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ చేపట్టిన దీక్ష మళ్లీ గుర్తుకువచ్చేలా దీక్షా దివస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు యుర్వేత రూప్‌దేవ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసీం, మాజీ సర్పంచ్ రాథోడ్ విష్ణు, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్, పట్టణాధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు రాథోడ్ శివాజీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాథోడ్ సుభాష్, నాయకులు లోకండే చంద్రశేఖర్, మెస్రం మానిక్‌రావ్, మడావి సాగర్, సుల్తాన్‌ఖాన్, ముంతాజ్, జితేందర్, గోపాల్ పాల్గొన్నారు.

కడెం, నవంబర్ 28 : నిర్మల్‌లో శుక్రవారం నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ పిలుపునిచ్చారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి మాజీ సీఎం కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టిన రోజును పురస్కరించుకుని దీక్ష దివస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కుభీర్, నవంబర్ 28 : నిర్మల్‌లో శుక్రవారం నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పార్టీ మండలాధ్యక్షుడు ఎన్నీల అనిల్, వైస్ ఎంపీపీ మొహియొద్దీన్, సీనియర్ పార్టీ నాయకుడు పుప్పాల పీరాజీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ కోసం ఎంతో తపించారని, జాతీయ స్థాయి నాయకులను ఒప్పించి రాష్ట్రాన్ని సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నార్నూర్: జ్యోతిబా పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎన్‌సీసీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం, నవంబర్ 28 : ఆదిలాబాద్‌లోని డీటీసీలో ఎన్‌సీసీ ఉమ్మడి జిల్లా 2వ వార్షిక శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌సీసీ వేదికని కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ వికాస్ శర్మ హాజరై ఎన్‌సీసీ కెడెట్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వికాస్ శర్మ మాట్లాడుతూ పది రోజుల వార్షిక శిబిరాన్ని ఎన్‌సీసీ కెడెట్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కెడెట్లతో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించడమే ఎన్‌సీసీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ జగరాం, లెఫ్టినెంట్ ఐలయ్య, ప్రశాంత్, వివిధ స్కూళ్లకు చెందిన ఎన్‌సీసీ కెడెట్లు, సీనియర్ జేసీవో భగీరత్, శిక్షణ జేసీవో బ్రిజేశ్ పాల్గొన్నారు.

## దయనీయంగా రైతాంగం

ఎదులాపురం, నవంబర్ 28 : ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతాంగం పరిస్థితి దయనీయంగా మారిందని తెలంగాణ రైతు సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెరుగుతున్న పెట్టుబడులు, నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మద్దతు ధరలు దక్కక రైతు కుటుంబాలు వీధిన పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతాంగాన్ని ఆదుకునేలా స్వామి నాథన్ కమిటీ సిఫారుసులకు అనుగుణంగా రైతులకు గిట్టుబాటు ధరలతో పాటు పంట నష్టపరిహారం, రైతు భరోసా, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే సంఘం 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించే సభలో దీనిపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సభకు రైతు సంఘాల నాయకులు, రైతులు, ప్రజాస్వామిక వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## కలెక్టర్‌ను కలిసిన టీజీవో సంఘం సభ్యులు

ఎదులాపురం, నవంబర్ 28 : నూతనంగా ఎన్నికైన టీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివకుమార్, డాక్టర్ రాథోడ్ రామారావ్, సంఘం సభ్యులు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాను గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి పూలమొక్కను అందజేసి నూతన కమిటీ సభ్యులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధికి గెజిటెడ్ అధికారుల సహకారం ఎంతో అవసరమన్నారు. టీజీవో సంఘ భవనానికి స్థలం కేటాయించాలని, ఎన్నికలకు సంబంధించి పెండింగ్ రెమ్యూనరేషన్ విడుదల చేయాలని కలెక్టర్‌ను నేతలు కోరారు. గజిటెడ్ అధికారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ శ్యామల దేవిని సైతం టీజీవో నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ టీజీవో అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి రామారావు,అసోసియేట్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రాజేషుడు, వామన్ రావ్, అరుణ, సంయుక్త కార్యదర్శి అనిల్, ప్రచారకార్యదర్శి సంతోష్ కుమార్, కార్యాలయ కార్యదర్శి ధర్మేందర్, సాంస్కృతిక కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, క్రీడల కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు భగత్ రమేశ్, సరోజ పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బోథ్, నవంబర్ 28: ఆదిలాబాద్‌లో గురువారం నిర్వహించిన చెకుముకి సైన్స్ పోటీల్లో మండల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కన్గుట్ట జడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులు శివప్రసాద్, అంజిత్, వివేక్ విజేతలుగా నిలిచారు. కలెక్టర్ రాజర్షి షా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గెలుపొందిన విద్యార్థులు డిసెంబర్ 14,15,16 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## యోగా సెంటర్ ప్రారంభం

ఎదులాపురం, నవంబర్ 28: ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో ఆయూష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా సెంటర్‌ను గురువారం కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. ముందుగా జ్యోతిప్రజ్వల చేశారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఆయూష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ వాణి, ఆర్ఎంఓ డాక్టర్ తొడసం చందు, జిల్లా మలేరియాధికారి ఎం శ్రీకాంత్, వైద్యులు సందీప్ పవార్, వెంకట్‌రెడ్డి, సందీప్ జాదవ్, ఆయూష్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ కాలేజ్ హాస్టల్ తనిఖీ

ఎదులాపురం, నవంబర్ 28: ఆదిలాబాద్‌లోని మావల పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్సీ కాలేజ్ హాస్టల్‌ను కలెక్టర్ రాజర్షి షా తనిఖీ చేశారు. భోజనాలు, సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టోర్ రూమ్‌లో నిల్వ ఉన్న వస్తువులను వాటి ఎక్స్‌పైరీ తేదీలను పరిశీలించారు. కాలేజ్ హాస్టల్‌లో అన్ని వసతులు సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమాధికారి భగత్ సునీతా కుమారి, ఏఎస్‌డబ్ల్యూవో నారాయణరెడ్డి, హెచ్ డబ్ల్యుఓ ఉన్నారు.

## సానాల గ్రామస్తుల సంబురాలు

బోథ్, నవంబర్ 28 : సానాల మండల ఏర్పాటు ఉత్తర్వులు జారీ కావడంతో సాధన కమిటీ ఆధ్వర్యంలో గురువారం సంబురాలు నిర్వహించారు. యువజన సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, రైతులు, ప్రజాప్రతినిధులు స్థానిక మందిరం శివాజీ వరకు వియోత్సవ ర్యాలీ తీశారు. డప్పుచప్పుళ్లతో ర్యాలీగా వచ్చారు. మహానుబావుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అందరం కలిసి మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని సాధన కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## కార్యాలయాల ఏర్పాటుకు భవనాల పరిశీలన

సానాల మండలం ప్రకటనతో కార్యాలయాల ఏర్పాటుకు అనువైన భవనాలను గ్రామస్తులు పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలోని గదులు పక్కనున్న సహకార సంఘం గోదాం, సాంఘిక సంక్షేమ వసతి గృహం, వీడీసీ భవనాలను పరిశీలించారు.

## ఇథనాల్ పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలి

దిలావర్‌పూర్, నవంబర్ 28 :దిలావర్‌పూర్ గుండంపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ అనుమతులను పూర్తిగా రద్దు చేయాలని గురువారం దిలావర్‌పూర్ రైతు జేఏసీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు హైదరాబాద్‌లో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందించారు. రెండు రోజులుగా దిలావర్‌పూర్‌లో జరిగిన సంఘటనలను ఐటీశాఖ మంత్రికి రైతులు నాయకులు వివరించారు. రైతుల ఆందోళన నేపథ్యంలో కలెక్టర్ చర్చలకు పిలిచి పరిశ్రమ అనుమతులను రద్దు చేస్తామని చెప్పినట్లు మంత్రికి వివరించారు. పరిశ్రమకు సంబంధించి పూర్తి అనుమతులను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి,మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, రైతు నాయకులు ఉన్నారు.

# భైంసాను సందర్శించిన శిక్షణ అధికారులు

భైంసా, నవంబర్ 28 : భైంసా మున్సిపల్ కార్యాలయాన్ని ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రవీందర్ కుమార్, రవికాంత్, హైమద్ చౌదరి, కవాస్ రెడ్డి, సైబాజ్ రైమాన్, శుభమ్ అగర్వాల్, రవి మౌర్య, రీతు సుందరం గురువారం సందర్శించారు. మున్సిపాలిటీకి సంబంధించిన విధి విధానాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతేగాకుండా పట్టణంలో తిరుగుతూ విధులను, తదితర వంటి వాటిని పరిశీలించారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ రాజేశ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

భైంసా: మున్సిపల్ కార్యాలయంలో ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు

### ఖానాపూర్ ..

ఖానాపూర్, నవంబర్ 28 :ఖానాపూర్ పట్టణం, మున్సిపల్ కార్యాలయాన్ని ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్ బృందం సభ్యులు సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న సేవలను మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యంను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు చేరవేస్తూ, డిజిటల్ రంగం వైపు ముందుకు సాగాలని సూచించారు. ఇక్కడ ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు గౌరవ్, ఆయుష్, మౌర్య, ప్రశాంత్, కిరణ్, రోహిత్, నిచ్చల మిట్టల్, శుద్ధనుషు, మీనా, సుశాంత్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఉన్నారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాలను ..

ఖానాపూర్ టౌన్, నవంబర్ 28: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ట్రైనీ కలెక్టర్లు సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న కోర్సులు, సౌకర్యాలు, కళాశాల నిర్వహణ తీరుపై ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ మనోహర్, కళాశాల సిబ్బంది ఉన్నారు.

# గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిబా పూలే

ఖానాపూర్. నవంబర్ 28 : వెనుకబడిన, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే అని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. ఖానాపూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో గురువారం మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముథోల్, నవంబర్, 28 : ముథోల్‌లోని జ్యోతిబా పూలే చౌరస్తా 134వ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో జ్యోతిబా పూలే కమిటీ సభ్యులు రమేశ్, దేవోజీ భూమేశ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు సాయన్న, సిద్దార్థ, యూత్ అధ్యక్షుడు దమ్మపాల్, మాజీ సర్పంచ్ మోహన్ యాదవ్‌పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్, నవంబర్ 28: నిర్మల్‌లోని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కిషన్, వెంకటరమణ పాల్గొన్నారు.

బేల, నవంబర్ 28: మండల కేంద్రంలో మాలీ కులస్తులు మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలీ సంఘం మండలాధ్యక్షుడు శేండే అంబదాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్జులే సురేశ్, నాయకులు వివేక్, తేజ్‌రావ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

నార్నూర్, నవంబర్ 28 : మండల కేంద్రంలోని త్రిరత్నబుద్ధవిహార్ ప్రాంగణంలో అంబేద్కర్ అసోసియేషన్, విశాఖ మహిళా సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, విద్యవేత్త బాలాజీకాంబ్లే, దేవ్‌రావ్, సునీల్ పాల్గొన్నారు.

దస్తురాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాన్సన్ నాయక్, నాయకులు

కడెం, నవంబర్ 28 : లింగాపూర్ జడ్పీ పాఠశాలలో మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కాలేరి భూమేశ్వర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తలమడుగు, నవంబర్ 28: సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిబా పూలే దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. జ్యోతిబా పూలే వర్ధంతిని పురస్కరించుకుని సుంకిడి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్ స్వామి అధ్యక్షతన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, గజానన్, సంజీవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆందోళన

కడెం, నవంబర్ 28 : కన్నాపూర్ గ్రామంలోని ఎల్ఎంఆర్ డిగ్రీ కళాశాలలో పరీక్ష ఫీజును అధికంగా వసూలు చేస్తున్నారని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అడ్మిషన్ల సమయంలో పరీక్షా కేంద్రాన్ని స్థానికంగానే ఏర్పాటు చేస్తామని తప్పుడు హామీలు ఇచ్చి కళాశాలలో అడ్మిషన్లు చేయించారని, అల్లంపల్లి, గంగాపూర్, దస్తురాబాద్ మండలంతో పాటు, దాదాపు 50 కిలో మీటర్ల దూరం నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులకు ఖానాపూర్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల మరింత దూరభారం పెరిగే అవకాశం ఉన్నందున తమ భవిష్యత్‌తో యాజమాన్యం ఆడుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ గదికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ విషయమై సంబంధిత కళాశాల కరస్పాండెంట్‌ను వివరణ కోరగా, గతంలో అనుమతి ఉండేదని, ఈ ఏడాది కూడ వస్తుందనే నమ్మకంతో విద్యార్థులకు హామీ ఇచ్చామని అన్నారు. అనుమతులు రాని కారణంగా ఇక్కడి సెంటర్‌ను ఖానాపూర్ ఏఆర్ఎస్‌కు మార్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు అందజేత

ఇంద్రవెల్లి, నవంబర్ 28: ముత్నూర్ గ్రామానికి చెందిన సూర వెంకటి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు.